నిరంతరం పారిశుధ్య పనులు

- కార్పొరేషన్‌లో కొనసాగుతున్న 100 రోజుల ప్రణాళిక
- పనులు చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న అధికారులు

పట్టణాలు, నగరాల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం 100 రోజుల ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మున్సిపల్ సిబ్బంది స్థానికంగా ఉన్న పలు సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.


సంజీవ్‌రెడ్డికాలనీలో మోరీల్లో స్ప్రే చేస్తున్న సిబ్బంది


గోల్‌హన్‌మాన్ వద్ద మురుగుకాలువలను శుభ్రం చేస్తున్న కార్మికులు

నిజామాబాద్ సిటీ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగుతున్నాయి. పట్టణాలు, నగరాలు రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం వంద రోజుల ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఈకార్యక్రమాన్ని జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రతి అంశాన్ని సమగ్రంగా అమలు చేయాలని, ఇందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. దీంతో సెలవు రోజుల్లో సైతం పారిశుధ్య సిబ్బంది పనులు చేస్తున్నారు.

ప్రత్యేక టీంలతో..

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పారిశుధ్య పనులు వేగవంతం చేస్తున్నారు. ప్రతిరోజు పనిచేసే సిబ్బందితో పాటు ప్రత్యేక సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. అపరిశుభ్రంగా ఉండే కాలనీలు, ఫిర్యాదులు వస్తున్న కాలనీల్లో వెంటనే సిబ్బందితో పనులు నిర్వహిస్తున్నారు. బోర్గాం (పి), వినాయక్ నగర్, సాయినగర్ కాలనీ, పులాంగ్, గాయత్రినగర్, అర్సపల్లి, మాణిక్‌బండార్, ముబారక్‌నగర్ వంటి ప్రాంతాల్లో నిరంతరం శానిటరీ పనులు సాగుతున్నాయి. రెండోశనివారం, ఆదివారం సైతం శానిటరీ సిబ్బంది, జవాన్లు పనులు చేస్తున్నారు. వీరి పనులను క్షేత్రస్థాయిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జోన్లలో జరుగుతున్న పనులను శానిటరీ సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తున్నారు.

ఆకస్మిక తనిఖీలు..

బల్దియాలో జరుగుతున్న 100 రోజుల ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు. పలు మార్లు ఆకస్మికంగా తనిఖీలు చేసి, సిబ్బంది హాజరును పరిశీలించారు.

సమస్యలను పరిష్కరిస్తాం



నగరంలో పారిశుధ్య పనులు నిరంతరం జరుగుతున్నాయి. 100 రోజుల ప్రణాళిక కోసం ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేశాం. నగరంలో ఎక్కడైన సమస్యలుంటే వాటిని తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తాం.

– దిలీప్‌కుమార్, కమిషనర్, బల్దియా

చదువుతోనే మంచి భవిష్యత్తు


ప్రతిభ పురస్కారం అందిస్తున్న గౌడ సంఘం నాయకులు

నిజామాబాద్ అర్బన్: చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని గౌడ అఫీషియల్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్ అన్నారు. ఆదివారం నగరంలోని గౌడ అఫీషియల్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన గౌడ కులస్తులు ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటే అసోసియేషన్ తోడుగా ఉంటుందన్నారు. విద్యార్థులు మాత్రం చదువుకు దూరం కావద్దన్నారు. గౌడ కులస్తులకు సంబంధించి గౌడ హాస్టల్ నిర్మాణం చేపడుతున్నామన్నారు విద్యార్థుల విద్య బోధనకు సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామన్నారు గౌడ ప్రజాప్రతినిధులు విద్యావంతులు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలన్నారు. మంచి ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు అనంతరం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఏటా గౌడ విద్యార్థులకు ప్రోత్సహించేందుకు ప్రతిభ పురస్కారాలు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరికి విద్య సౌకర్యాలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మారయ్య గౌడ్, పట్టణ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, రవీందర్ గౌడ్, సోమలింగం గౌడ్, రాజా గౌడ్, భోజగౌడ్ శ్రీనివాస్ గౌడ్ సతీష్ గౌడ్, విపుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

నిజామాబాద్ నాగారం: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని డీఈవో పార్శి అశోక్ అన్నారు. ఆదివారం వినాయక పద్మశాలి ఐక్య వేదిక (వినాయక నగర్ తర్గా సంఘాల సమూహం)' ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 2025 సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెమెంటో, ప్రశంసపత్రం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఈఈవో లోకం రఘురాజ్, జిల్లా సంఘం అధ్యక్షులు బిజ్జు దత్తాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు, నగర సంఘం అధ్యక్ష కార్యదర్శులు పెంట దత్తాద్రి, చౌటి భూమేశ్వర్, ఐక్య వేదిక అధ్యక్షులు గుడ్ల భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి పెంట ధనంజయ్, కోశాధికారి పగిడిమారి యాదగిరి, సలహాదారులు రాపెల్లి గురుచరణం, గుజ్జేటి వెంకట్ నర్సయ్య, చింత శంకర్, ఉపాధ్యక్షులు చింత మురళీధర్, కొండ గంగాచరణ్, సహాయ కార్యదర్శి గజ్జల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న ఓమయ్య

నిజామాబాద్ సిటీ/మోపాల్: : కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లాలోని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లి, ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కె సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు జీ.భూమయ్య హాజరై మాట్లాడారు.ఈ సమావేశంలో ఐక్య కార్మిక సంఘాల నాయకులు నరేందర్, కాజా మొయినుద్దీన్, భూమేష్, ఆజాద్ పాల్గొన్నారు.

రైస్ మిల్లు పరిశ్రమల్లో జూలై 9న జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య కోరారు. ఏఐటీయూసీ రైస్ మిల్ ఫిట్టర్ యూనియన్ కార్యాలయంలో రైస్ మిల్లు ఇండస్ట్రీలో పనిచేస్తున్న కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 44 రకాల చట్టాలను పునరుద్ధరించి, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్ పరిశ్రమలో ఎనిమిది గంటలకు మించి పని చేస్తున్న కార్మికులకు చట్ట ప్రకారం ఓవర్ టైం డ్యూటీలు చెల్లించాలని, పీఎఫ్ ,ఈఎస్ఐ, ఇన్సూరెన్సు సౌకర్యం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. అనిల్, ఉపాధ్యక్షులు జాఫర్, సహాయ కార్యదర్శి సాయిలు, లాయక్ ,రమేష్, తిరుపతి రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజు, శివకుమార్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ చైర్మన్‌గా విజయానంద్



నిజామాబాద్‌నాగారం: లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ 320ఈ ప్రిలిమినరీ క్యాబినెట్ సమావేశం ఆదివారం హైదదార్‌లో జరిగింది. గవర్నర్ లయన్ అమర్నాథ్ రావు 2025- 26 సంవత్సరానికి యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాల జిల్లా చైర్మన్ గా జిల్కార్ విజయానంద్‌ను నియమించారు. ప్రస్తుతం జోన్ చైర్మన్‌గా ఉన్న లయన్స్ క్లబ్ ఇందూర్‌కు పూర్వాధ్యక్షులుగా విజయానంద్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా వైస్ గవర్నర్ నరసింహరాజు, జిల్లా కోశాధికారి మర్రి ప్రవీణ్, జిల్లా కేబినెట్ అధికారులు దీకొండ యాదగిరి, లక్ష్మీనారాయణ, కరిపే రవీందర్, రమేష్ కులకర్ణి పాల్గొన్నారు.

శ్రీశ్రీ కి ఘన నివాళులు

నిజామాబాద్ రూరల్: తెలుగు సాహిత్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకొచ్చిన ఘనత శ్రీశ్రీకి దక్కిందని డీసీఈబీ కార్యదర్శి బి. సీతయ్య అన్నారు. ఆదివారం మహాకవి శ్రీశ్రీ 42వ వర్ధంతిని నాందేవ్‌వాడలోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీశ్రీ రాసిన రచనలు కొనియాడారు. శ్రీశ్రీ చిత్రపటానికి కవులు, గాయకులు నివాళులు అర్పించారు.

పూలతో 'నాన్నకు ప్రేమతో '..



మోపాల్ లో నాన్నకు ప్రేమతో చిన్నారులు, పెద్దలు

మోపాల్ : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలలో చిన్నారులు, గ్రామ పెద్దలు ఆదివారం ఫాదర్స్ డే జరుపుకున్నారు. ఈసందర్భంగా పువ్వులతో 'నాన్నకు ప్రేమతో ' అని లిఖించి నాన్నపై మమకారాన్ని చాటుకున్నారు. నవీన్ రెడ్డి, ముత్తేన్న,గంగాధర్, సాయిలు,సంజీవ్ రెడ్డి, అక్షర, ఆకృతి, కన్నయ్య పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు చివరి అవకాశం

నిజామాబాద్‌అర్బన్: డిగ్రీలో ప్రవేశాలకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి మూడో దఫా కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రారంభించినట్లు గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సైదా జైనబ్ తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన వి డుదల చేశారు. నగర శివారులోని నాగారంలో ఉన్న తమ కళాశాలలో బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, బీబీఏ, ఎంపీసీఎస్, ఎంఎస్ సీఎస్ గ్రూప్‌లలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నా రు. విద్యార్థులు తక్షణమే తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి సీటు పొందాలని తెలిపారు. దోస్త్ ఐడీ రిజిస్ట్రేషన్ కూడా తామే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం ఉందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ


గ్రామదేవతల విగ్రహాలతో గ్రామస్తులు

డిచ్‌పల్లి: మండలంలోని ముల్లంగి(ఐ) గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రతిష్ఠించారు. అనంతరం ఇటీవలే నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, మాజీ ఎంపీపీ చిన్నోల్ల నర్సయ్య, సొసైటీ చైర్మన్ గ్యానాజి గంగారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గంగారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహాధర్నాను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ధర్పల్లి: హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 17న జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బాలయ్య, కారల్‌మార్క్స్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీ నేతలతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగుతున్న హత్యాకాండను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో నిమ్మల భూమేష్ , మల్కి సంజీవ్,నర్సగౌడ్ పాల్గొన్నారు.

ఇందూరు తిరుమలలో ఘనంగా స్వామి వారి కల్యాణం


స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మోపాల్ : స్వామి వారి కల్యాణం అంటే లోక కళ్యాణం అని, స్వామి వారి కల్యాణం చూస్తేనే సకల పాపాలూ పోతాయని ఆచార్య సంపత్ కుమార స్వామి పేర్కొన్నారు. మోపాల్ మండలం నర్సింగ్ పల్లి ఇందూరు తిరుమల ఆలయంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల శ్రవణ నక్షత్రం రోజు తొమ్మిది జంటలకు అవకాశం ఇచ్చి వారితో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ ప్రధాన ధర్మ కర్త నర్సింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రోహిత్ కుమారాచార్య, నరాల సుధాకర్, విజయ్, అనిల్, నర్సారెడ్డి, పథ్వీ, భాస్కర్, సాయిలు, నరేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న వెంకటశివకుమార్

నిజామాబాద్ రూరల్ : సమాజంలో ఇస్కాన్ సేవలు అభినందనీయమని ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ సర్రా వెంకటశివ కుమార్ అన్నారు. ముబారక్‌నగర్‌లోని ఇస్కాన్ కేంద్రంలో ఆదివారం జగన్నాథ రథయాత్రకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. జూలై 4వ తేదీన జరిగే జగన్నాథ రథయాత్ర కార్యక్రమాన్ని ఆనందోత్సహాల మధ్య జరుపుకోవాలన్నారు. భగవద్గీతను, రామాయణ, మహాభారతాలను చదవటమే కాకుండా వ్యక్తిగత జీవితంలో ఆచరణ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షులు రామానంద రాయ ప్రభుదాస్, స్వామి యాదవ్, ఎండల సుధాకర్, రఘు,ఇస్కాన్ కేంద్ర సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నగర యాదవ సంఘం అధ్యక్షుడిగా విక్కీ యాదవ్


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

నిజామాబాద్ సిటీ : నగర యాదవ సంఘం అధ్యక్షుడిగా విక్కీ యాదవ్ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఇంద్రాపూర్‌లోని యాదవ సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కొత్త అధ్యక్షుడిగా విక్కీయాదవ్, గౌరవ అధ్యక్షుడిగా హన్మంతు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్ యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నగరంలో యాదవ సంఘం అభివృద్ధికి పాటుపడతానని విక్కీయాదవ్ తెలిపారు.

పడకంటి రాముకు సన్మానం



నిజామాబాద్‌నాగారం: అమెరికా విశ్వవిద్యాలయం నుంచి ఇటీవల డాక్టరేట్ అందుకున్న పడకంటి రామును ఆదివారం నగరంలోని బైపాస్‌రోడ్‌లో ఉన్న ఇంటిలో నాయకులు సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్,జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి తక్కూరి దేవేందర్, కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట్ రవి, కమ్మర్‌పల్లి మండల ఏఎంసీ డైరెక్టర్ మధులత శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల స్థాయి నాయకుడు పేరం సుధాకర్ తదితరులున్నారు.

నేటి చిత్రం



ప్రధాన రోడ్డులో నిలుస్తోన్న వర్షపు నీరు

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్ గ్రామ ప్రధాన రోడ్డులో వర్షం నీరు నిల్వ ఉండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలి.

– నవీన్, సికింద్రాపూర్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 నిజామాబాద్ రూరల్ - 97053 46541

అసంపూర్తిగా డివైడర్ల నిర్మాణం


ముబారక్‌నగర్‌లో అసంపూర్తిగా ఉన్న డివైడర్

- నగరంలో శ్రీ లక్ష్మీప్రియనగర్ నుంచి సుక్‌జిత్ ఫ్యాక్టరీ వరకు
- పర్యవేక్షణ చేయని అధికారులు


ధ్వంసమైన డివైడర్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రధాన రహదారుల మధ్యలో డివైడర్ల నిర్మాణం చేపట్టారు.. నలువైపులా పనులు పూర్తి చేశారు. కాగా, ఆర్మూర్ రోడ్‌లోని ముబారక్‌నగర్ ప్రాంతంలోని శ్రీ లక్ష్మీప్రియనగర్ చౌరస్తా నుంచి ఆర్టీసీ కాలనీ చౌరస్తా మీదుగా సుక్‌జిత్ ఫ్యాక్టరీ వరకు డివైడర్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. దాదిన్నరగా అధికారులు పర్యవేక్షణ లేకపోవడంపై అనుమానాలకు తావిస్తోంది. డివైడర్ల పనులు పూర్తి కాగానే చెట్లు పెంచాలి. వాహనాలు వెళ్తుంటే ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలనే ఉద్దేశ్యంతో పచ్చదనంతో కూడిన చెట్లు పెంచుతున్నారు. కంఠేశ్వర్ మీదుగా సుజిత్ ఫ్యాక్టరీ వరకు ఆర్మూర్ రోడ్‌లో డివైడర్ల నిర్మాణ పనులు అంతంత మాత్రంగానే చేపట్టారు. సుమారు ఒక్క కిలోమీటర్ మేర పొడవు ఉన్న డివైడర్ అధ్వానంగా మారుతోంది. ఎక్కడికక్కడ డివైడర్లు ధ్వంసమవుతున్నాయి. నిర్మాణ పనులు సైతం మధ్యలోనే ఆపేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన డివైడర్ల నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ అనారోగ్యానికి గురయ్యాడని త్వరలోనే పనులు పూర్తి చేయిస్తానని అప్పటి ఈఈ సురేష్ తెలిపారు. ఏడాదిన్నర గడిచినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

త్వరగా పనులు పూర్తి చేయాలి

రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్ల పనులు త్వరగా పూర్తి చేయాలి. డివైడర్లలో చెట్లు పెంచితే బాగుంటుంది. రాత్రుల్లో కూడా లైటింగ్ ఏర్పాటు చేయాలి. డివైడర్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.

-కృష్ణ, వాహనదారుడు, ముబారక్‌నగర్

మా పరిధి మేరకు పనులు పూర్తి చేశాం

డివైడర్ల పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు స్ట్రోక్ రావడంతో పనుల్లో కాస్త ఆలస్యమైంది. పనులు మాత్రం పూర్తి చేశాం. కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు బిల్లులు కూడా రాలేదు. మా పరిధిలో ఉన్న పనులు మాత్రం పూర్తి చేయించాం.

– సాయికుమార్, ఆర్అండ్‌బీ ఏఈ

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	99,000	వెండి(కిలో)	1,09,000
22 క్యారెట్స్	91,390	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	క్యాప్సికం	50	90
బెండకాయ	30	50	గాజరుగడ్డ	30	60
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	25	50	దోసకాయ	20	40
బీర్నిసుకాయ	100	150	ఆలుగడ్డ	30	50
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	30	60	గోబిపువ్వు	50	80
పాలకూర	80	120	బీట్‌రూట్	30	60
మెంతికూర	100	140	కరివేపాకు	40	60
కొత్తిమీర	40	60	చామగడ్డ	30	50
పుదీనా	70	100	చిక్కుడుకాయ	40	60

-సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1 తొలిప్రేమ-11.00,1.30,4.30,7.30, 10.30
స్క్రీన్-2 అందాల రాక్షసి-11.00, 4.30
హౌస్‌ఫుల్-5(హిందీ)-1.35, 7.30, 10.30
హౌస్‌ఫుల్-5(హిందీ)-1.35, 7.30, 10.30
స్క్రీన్-3 అందాల రాక్షసి-10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 హౌటూ ట్రైన్ యువర్ డ్రాగన్ (3డీ)-11.00, 1.45, 4.30
హౌటూ ట్రైన్ యువర్ డ్రాగన్ (3డీ ఇంగ్లీష్)-7.15,10.00
స్క్రీన్-2 హౌస్‌ఫుల్-5(హిందీ)-10.10, 4.25
జాన్ విక్-5-1.40
జాన్ విక్-5(ఇంగ్లీష్)-7.55, 10.40
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-1.10
స్క్రీన్-3 ది హంటర్: చాప్టర్-1-11.10
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-1.50
జాన్‌విక్-5-4.20
హౌస్‌ఫుల్-5(హిందీ)-7.05, 10.35
పాడేరు 12 మైలు-8.00
స్క్రీన్-4 జాన్‌విక్-5-11.30
కట్టప్ప జడ్జిమెంట్-2.15 - పాప-4.50
అందాలరాక్షసి-7.35, 10.45
దేవి తొలిప్రేమ నటరాజ్ హౌస్‌ఫుల్-5 (హిందీ)

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ & రూరల్ జి. రాంనాథ్ : 9849180084
బాల్కొండ ప్రవీణ్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899